ప్రజాశక్తి

బుధవారం 15 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు







చేబ్రోలు మండలంలో క్వారియింగ్ జరిగిన ప్రాంతాలు

అక్రమ మైనింగ్‌పై సిఎం సీరియస్

- భారీగా గ్రావెల్ తవ్వకాలు జరిగినట్టు నిర్ధారణ
- జగన్ ధర్నా చేసిన ప్రదేశంలోనే క్వారీయింగ్
- ఎవరు అధికారంలో ఉంటే వారిదే రాజ్యం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అధికారంలో ఎవరున్నా గుంటూరు జిల్లాలో అక్రమ మైనింగ్ ఆగడం లేదు. పొన్నూరు నియోజకవర్గం పరిధిలో పలు గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. చేబ్రోలు మండలంలో అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ఉన్నతాధికారులు నివేదిక రూపొందించి కొద్ది రోజుల క్రితం సిఎంకు అందచేశారు. జిల్లా అధికారులు పట్టించుకోకపోయినా రాష్ట్ర యంత్రాంగం ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గతమూడేళ్ల కాలంలో చేబ్రోలు మండలం పరిధిలో 5 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు జరిగినట్టు నివేదికలో పేర్కొనట్టు తెలిసింది. దాదాపు రూ.150 కోట్ల వరకు చేతులు మారినట్టు తెలిసింది. రెండేళ్ల క్రితం మైనింగ్ శాఖ అధికారులు జరిమానాలు విధించి మమ అనిపించారు. ఇటీవల కాలంలో చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

టిడిపి ప్రభుత్వ హయాంలో మాదిరిగానే వైసిపి హయాంలోనే ఎక్కువగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు తెలిసినా ప్రజా ప్రతినిదుల వత్తిడితో ఏమీ చేయలేకపోతున్నారు. 2021లో పలు మార్లు దాడులు చేసి రూ.62 లక్షలు జరిమానా విధించారు. 2022-23లో ఇంతవరకు ఎటువంటి నియంత్రణా లేదు. ప్రధానంగా చేబ్రోలు మండలంలో ఎర్ర మట్టి తవ్వకాల్లో టిడిపికి చెందిన నాయకులు కొంత మంది కూడా వైసిపి వారితో కలిసి తవ్వకాలకు సహకరిస్తున్నారనే ప్రచారం ఉంది. రాజకీయంగా టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నా అంతిమంగా ఎవరు అధికారంలో ఉంటే వారు అక్రమాలకు పాల్పడుతున్నారు.

2014-19 మధ్య కాలంలో టిడిపి హయాంలో గ్రావెల్ మాఫియా కారణంగా 16,399 క్యూబిట్ మీటర్ల అక్రమ క్వారీయింగ్ జరగ్గా రూ.33,28,769 జరిమానా వసూలు చేశారు. అయితే 2019-22 మధ్య కాలంలోనూ అక్రమ 2లో

పది విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు నిరాకరిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట



ఫీజు చెల్లించలేదనే నెపంతో పదో తరగతి విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు హాల్‌టిక్కెట్లు ఇవ్వడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. హాల్‌టిక్కెట్ జారీకి ఎవరైనా నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రైవేటు విద్యాసంస్థలపై విద్యా శాఖాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

21న నిరసన జయప్రదం చేయండి

- గుంటూరు రౌండ్‌టేబుల్‌లో ప్రజాసంఘాలు, దళిత సంఘాల నేతల పిలుపు
- సామాజిక తరగతుల ప్రాతిపదికన జనగణన చేయాలని డిమాండ్

వార్త మెయిన్ పేజీలో

ఇంటర్ పరీక్షలకు ఆర్టీసీ రవాణా ఏర్పాట్లు

ఇన్‌ఛార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

బుధవారం నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకూ నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు రవాణా సమస్యలూ లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజారవాణా ఇన్‌ఛార్జి అధికారి నర్రా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు, వారి సహాయకులకు తగిన సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. గుంటూరు పట్టణంలో పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకూ పరీక్షలు ఉంటాయని, కావున తిరుగు ప్రయాణంలోనూ వారికి ఇబ్బంది లేకుండా రవాణా సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణించే రూట్లలో హాల్‌టిక్కెట్ చూపిస్తే తప్పనిసరిగా ఆయా విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని సిబ్బందిని ఆదేశించామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





కల్వర్టు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు, స్థానికులు

వంతెన నిర్మాణమే శాశ్వత పరిష్కారం

- ప్రైవేటు వ్యక్తులు వేయించిన తూములను తొలగించాలి
- సుందరయ్య కాలనీవద్ద కల్వర్టును పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలోని సుందరయ్య కాలనీ శ్మశానం సమీపంలోని కల్వర్టుపై ప్రైవేటు వ్యక్తులు వేసిన తూములను వెంటనే తొలగించాలని, శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు కల్వర్టును ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు ఎ.వీరబ్రహ్మం, జి.సుసులోవ్, పి.ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2లో

విద్యార్థిని అటకాయించి దారిదోపిడీ

బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లిన దుండగులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



గాయాన్ని చూపుతున్న బాధితుడు సాయిశ్రీనివాస్

విద్యార్థిని అటకాయించి దారి దోపిడీకి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భృగుబండ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. క్రోసూరు మం డలం పెరికపాడుకు చెందిన కుంభ సాయిశ్రీనివాస్ నరసరావుపేటలోని ఎంఎంఎం కాలేజీలో ఫార్మాడీ చదువుతున్నారు. కోర్సులో భాగంగా కాలేజీ అనంతరం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. సొంతూరుకు రవాణా సదుపాయాలు సరిగా లేకపోవడంతో ద్విచక్ర వాహనంపైనే రాకపోకలు సాగిస్తూ ప్రతిరోజూ రాత్రి 7.30 గంటలకు నరసరావుపేటలో బయలుదేరి ఇంటికి వెళుతుంటారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటికెళ్తుండగా 9 గంటలప్పుడు సత్తెనపల్లి మండలం భృగుబండ వద్దకు రాగానే మరో ద్విచక్ర వాహనంపై మాస్కులు వేసుకుని ముగ్గురు దుండగులు వచ్చి సాయిశ్రీనివాస్‌ను అటకాయించి దౌర్జ న్యానికి పాల్పడ్డారు. మెడలోని బంగారు గొలుసును లాక్కుంటుండగా సాయిశ్రీనివాస్ ప్రతిఘటించారు. ఒకరు గొలుసును లాక్కుని వాహ నంపై వెళుతుండడంతో అతన్ని పట్టుకునేందుకు సాయిశ్రీనివాస్ ప్రయత్నించగా అదే అదునుగా మిగతా ఇద్దరూ సాయిశ్రీనివాస్ బైక్‌ను తీసుకుని పరారయ్యారు. పెనుగులాటలో గాయపడిన సాయిశ్రీనివాస్ అనంతరం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎ.బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా, ఉద్యోగ, ఉపాధికి నవోదయ కృషి



నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శివ శంకర్

ప్రజాశక్తి-నరసరావుపేట

నవోదయం కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అధికారుల సమన్వయంతో యువతకు విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పొందేందుకు కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ శివ శంకర్ అన్నారు. పల్నాడు కలెక్టరేట్‌లో మంగళవారం చేపట్టిన నవోదయం కార్యక్రమంలో జిల్లాకు చెందిన విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అభివృద్ధికి చెందిన శాఖల అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు పాల్గొని, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందించారు.ఆయా శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సచివాలయ అధికారులు సిబ్బంది సహకారంతో ఆన్ లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపి భరోసా కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 365 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో పాటుగా పలు కంపెనీలు, విద్యా, వ్యాపార, బ్యాంకులు వంటి సంస్థలు పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఇద్దరికీ సెక్యూరిటి ఉద్యోగాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. నవోదయం కార్యక్రమానికి తరలి వచ్చిన వారికి కలెక్టరేట్‌లో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారి వినాయకం, ఆయా శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఐటిఐలో వృత్తి విద్యా కోర్సులకు ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధి,శిక్షణ శాఖ 10వ తరగతి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చినరావూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సిహెచ్ ఎస్వి ప్రసాద్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో "లైన్ మెన్ డిస్ట్రిబ్యూషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ టెక్నీషియన్ తదితర వృత్తి విద్యా కోర్సులలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. 10 వ తరగతి కనీస విద్యార్హత కలిగి 18 ఏళ్ళ వయస్సు నిండిన అభ్యర్థులు పైన పేర్కొన్న కోర్సులకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగిన ధ్రువపత్రంతో పాటు, ఆధార్ కార్డ్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో కార్యాలయం పనివేళలల్లో వెంటనే సంప్రదించాలని తెలిపారు.

వెలగపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని వెలగపూడిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. నియోజక వర్గ వైసిపి సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు గురించి ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరావు,నాయకులు బండి స్టాలిన్, నేలపాటి నాగేంద్రం,ఆరేపల్లి జోజి,ఎస్ సురేష్, సచివాలయ సిబ్బంది గహసారథులు, వాలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై సిఎం సీరియస్


(మొదటి పేజీ తరువాయి)

తవ్వకాలు కొనసాగాయి. 56,834 క్యూబిక్ మీటర్లకు రూ.2,06,63,127 జరిమానా విధించారు. అంటే టిడిపి హయాంలో కంటే వైసిపి హయాంలోనే ఎక్కువ అక్రమ క్వారీయింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. కానీ 2022-23 మధ్య కాలంలో అక్రమ క్వారీయింగ్ కూడా ఎటువంటి జరిమానాలు విధించడం లేదు.

చేబ్రోలు మండలంలోని సుద్దపల్లి, వడ్లమూడి, వేజెండ్ల, సేకూరు, శ్రీరంగపురం తదితర గ్రామల పరిధిలో ఈ తవ్వకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే నాయకులకు వచ్చే ఆదాయం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటోందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో చేబ్రోలు మండలంలో జరిగిన అక్రమ తవ్వకాలపై ప్రభుత్వ పెద్దలు జిల్లాకు చెందిన ఒక సీనియర్ ప్రజా ప్రతినిధిని వివరణ కోరినట్టు తెలిసింది. టిడిపి హయాంలో అక్రమ తవ్వకాలపై 2018లో ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ధర్నా చేసిన ప్రదేశంలో గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు జరిగినట్టు సిఎం కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలిసింది. తాను ధర్నా చేసిన ప్రదేశంలో తవ్వకాలు జరపడంపై సిఎం సీరియస్ అయినట్టు సమాచారం.

సునీల్ మాస్టర్ మృతి

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్



మంగళగిరి సుమ అకాడమీ అధినేత కొమ్మతోటి సునీల్ కుమార్ (59) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మంగళగిరి దేవస్థానం రోడ్డులో సుమా అకాడమీ పేరిట విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. మంగళగిరికి చెందిన పలువురు పోలీస్ రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు , అడ్వకేట్లు, జర్నలిస్టులు ఆయన వద్ద స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ పొందారు. చేతికి జరిగిన శస్త్ర చికిత్స కారణంగా అనారోగ్యంతో గత కొంత కాలంగా బాద పడుతున్నారు. ఈ నేపథ్యంలో నవలూరులోని తన నివాసం వద్ద చిన్నపాటి గదిలోనే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు ఎన్నారై ఆస్పత్రికి తీసుకువెళ్లారు. హార్ట్ ఎటాక్‌తో ఆస్పత్రిలోనే కన్నుమూశారు. ఆయన నివాస గహం వద్ద పలువురు మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు.

వంతెన నిర్మాణమే శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పాడైపోయిన కల్వర్టు కింద ఉన్న తూములు పూడిక ఏర్పడి వాగుల గుండా వచ్చే మురుగునీరు కల్వర్టుపై పాడుతుండడంతో అటువైపుగా ఉన్న శ్మశానానికి, పొలాలకు వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షాకాలంలో వరదకు వాగు పొంగి సమీపంలోని సుందరయ్య కాలనీ, శాస్త్రి నగర్, శాలివాహన నగర్ వంటి లోతట్టు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఇటీవల సిపిఎం నిర్వహించిన పాదయాత్రలో ఈ సమస్యను గుర్తించి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలని వినతిపత్రం ఇవ్వగా అందుకు అధికారులు హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే ఇటీవల కల్వర్టుకు అటువైపుగా ఉన్న పొలాల్లో వెంచర్లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆయా ప్లాట్లలోకి మట్టిని తోలుకునేందుకు, ఇతర సామగ్రిని చేరవేయడానికి భారీ వాహనాలను ఉపయోగిస్తున్నారని, వాటికి కల్వర్టు అనువుగా లేకపోవడంతో కల్వర్టుపై రియల్టర్లు తూములు వేయించి రోడ్డు పనులు ప్రారంభించారని చెప్పారు. ఈ చర్య వల్ల భవిష్యత్తులో వరదలు వస్తే తమ కాలనీలు ముంపునకు గురవుతాయని ఆందోళన వెలిబుచ్చారు. అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకోవాలని ప్రైవేటు వ్యక్తులు వేసిన తూములను వెంటనే తొలగించి శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు మారెళ్ల శ్రీనివాసరావు, అనుముల సత్యనారాయణ, ఇక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18న వరల్డ్స్ లార్జెస్ట్ సెర్వికల్ కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఈ నెల 18న వరల్డ్స్ లార్జెస్ట్ సెర్వికల్ క్యాన్సర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, సీపీవోఐల (కలెక్టివ్ పవర్ ఆఫ్ వన్ ఇంటర్నేషనల్, యూఎస్‌ఏ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అవేర్‌నెస్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డైరక్టర్ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి, యూఎస్‌ఏ టెక్సాస్‌లోని సీపీవోఐ ఫౌండర్, సీఈవో డాక్టర్ సత్య ఎస్.కలంగి, యూఎస్‌ఏటెక్సాస్‌లోని సీపీవోఐ బోర్డ్ మెంబర్ డాక్టర్ డేల్ క్లైమీ, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకట సుజాత వెల్లంకిలు హాజరవుతారని తెలియజేసారు. ప్రపంచంలో సెర్వికల్ కేన్సర్ సమస్యతో ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ, మన దేశంలో అయితే ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ మృతి చెందుతున్నారని వెల్లడించారు. దాదాపు 40 దేశాలలో మహిళలు మృతి చెందుతున్న ప్రధాన కారణాలలో సెర్వికల్ కేన్సర్ ఒకటిగా నిలుస్తుందన్నారు. సెర్వికల్ కేన్సర్‌ను సరైన సమయంలో ఎలా గుర్తించాలి అనే అంశాలపై దాదాపు 5 వేల మందికి పైగా మహిళలకు అవగాహన కల్పించేందుకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ పూనుకుందని తెలియజేసారు. ఇంతమందికి ఒకేసారి అవగాహన కల్పించడం ఇదే మొదటిసారని.... దీనికై గిన్నిస్ వరల్డ్స్ రికార్డుకు ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

శ్మశాన సమస్య పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట:పట్టణంలోని 12వ వార్డులో ఉన్న శ్మశాన వాటిక సమస్యతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజినికి స్థానికులు మంగళవారం వినతి పత్రం అందించారు. మంత్రి రజిని స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారని చైర్మన్ ఎస్కే. రఫాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాదిలోపు శ్మశాన వాటికలోని జంగిల్ క్లియ ర్ మొత్తం పూర్తి చేయాలని, అలాగే ఆ వార్డులో మంచి నీటి సమస్య, మురుగు నీరు, డ్రైనేజీ,కల్వర్టులు,విద్యుత్ రోడ్లు సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆ దేశించారని తెలిపారు. వారం,పది రోజుల్లో పూర్తి చేయిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. గోవిందరావు, 12వ వార్డు కౌన్సిలర్ యడ్ల ఇందిరా, యడ్ల సురేష్, మున్సిపల్ డిఈ రమణ , ఏఈలు సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

మండలంలోని పాలపర్రులో మిరప, మొక్కజొన్న, శనగ, పొగాకు పైరులను జిల్లా వ్యవసాయ అధికారులు డిడిఏ రామాంజనేయులు, ఏడిఏ ప్రవీణ్ మంగళవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు . మిరప కోత సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మొక్కజొన్న పైరను పరిశీలించి కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. రైతులు స్ప్రేయర్లు ద్వారా పురుగు మందును మొవ్వలో పడే విధంగా పిచికారి చేస్తే మంచి ఫలితం ఇస్తుందన్నారు. శనగలు కొనుగోలు గురించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాలపర్రు ఉప సర్పంచ్ జంపని సంజీవరావు, ఇంచార్జ్ వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం విఏఏ పవన్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.



పోషకాహారం అందజేస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రిలో మంగళవారం తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ టిబి పేషెంట్లకు పౌష్టికాహారం అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని రోగులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిడిసికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) కార్యాలయ నిర్మాణం నిమిత్తం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ డి.రాజకుమారి మంగళవారం తాడేపల్లిలో స్థలం పరిశీలించారు. తాడేపల్లి పట్టణంలోని సర్వే నెంబర్ 372-10 రెండు సెంట్ల భూమిని అందుకు సంబంధించి డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ భూమిని వెంటనే తమకు బదలాయింపు చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, డైరెక్టర్ హెల్త్ డిపార్టుమెంట్ డాక్టర్ రామిరెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ మోహన్‌కృష్ణ, ఇతర అధికారులు, ఇంజనీర్ల బృందం పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల అదాలత్

ప్రజాశక్తి- మేడికొండూరు

గుంటూరు-2 టౌన్ డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 33/11 కేవీ డొకిపర్రు ఉపకేంద్ర ఆవరణలో ఈ నెల 16వ తేదీన ఉదయం10.30 నుండి 1.30 వరకు డివిజన్ పరిధిలోని మెడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచేరుకూరు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని విద్యుత్ వినయోగదారుల అదాలత్ నిర్వహించబడుతుందని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ చల్లా రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిజిఆర్ ఎఫ్ కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్ రిసాల్ ఫారం చైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్, సాంకేతిక సభ్యులు కె. వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఏ.రామ్ దాస్ , స్వతంత్ర సభ్యులు ఏ. సునీత పాల్గొంటారని తెలిపారు. విద్యుత్ వినయోగదారులు పరిష్కారం కాని విద్యుత్ సమస్యలను, రాత పూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియపరచి పరిష్కరించుకోవాలని కోరారు.

నాటునాటు పాటకు ఆస్కార్ రావడం అభినందనీయం

ప్రజాశక్తి -ఫిరంగిపురం

విఖ్యాత సినీ దర్శకులు రాజమౌళి దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ హీరోలుగా నటించి నృత్యం చేసిన తెలుగు సినిమా ఆర్ఆర్ఆర్‌లోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డ్ రావడం తెలుగు వారే కాకుండా భారతీయులందరూ సంతోషిస్తున్నారని ఇండియన్ సాలిడారిటీ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,కేర్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు గడ్డం.పాల్ విజయ కుమార్, కేర్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి రాయి విజయగగారిన్,కార్యదర్శి వి.కిరణ్ పాల్ మోజెస్ తెలిపారు. నాటు నాటు పాటను స్వరపరచిన సంగీత దర్శకులు ఎంఎం కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, నృత్యం చేసిన జూనియర్ ఎన్టీఆర్,రామ్ చరణ్ ,గాయకులు రాహుల్ సిప్లిగంజ్,కాలభైరవ,నృత్య దర్శకులు ప్రేమ్ రక్షిత్, నిర్మాత దానయ్యలకు అభినందనలు తెలిపారు.ప్రపంచ చరిత్రలో ఈ తెలుగు పాట శాశ్వతంగా నిలిచిపోతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

దాడి ఘటనలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కొల్లిపర :చిన్నారుల నడుమ జరిగిన ఘర్షణ ఒక హత్యకు దారి తీసిన ఘటన కొల్లిపర మండలం జముడుబాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మత్తే రవి, కురగంటి కోటేశ్వరావు నడుమ గతంలో స్థల వివాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం రెండు కుటుంబాలకు చెందిన పిల్లల మధ్య నెలకొన్న వివాదం కారణంగా మత్తే రవిపై కురగంటి కోటేశ్వరరావు కత్తితో దాడి చేశాడని, దాడిలో తీవ్రంగా గాయపడిన రవిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దాడికి పాల్పడిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెనాలి రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే రవీంద్రారెడ్డి తెలిపారు.



అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న ఆరు లారీలు స్వాధీనం

ప్రజాశక్తి - మాచర్ల

చిలకలూరిపేట ప్రాంతం వైపు నుండి మాచర్ల మీదుగా తెలంగాణ, మహారాష్ట్ర , కర్ణాటకలోని పలు ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీలను గుంటూరు నుండి వచ్చిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. సోమవారం మాచర్ల పట్టణంలోని రైల్వే గేటు వద్ద మాటు వేసిన అధికారులు గ్రానైట్ లోడుతో వస్తున్న లారీలు ఆపి తనిఖీలు చేశారు. 6 లారీల్లో నల్ల గ్రానైట్, ఒక లారీలో కలర్ గ్రానైట్ ఉందని గ్రానైట్ల లోడుతో సహా లారీలను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్ అధికారులు దాచేపల్లి మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌ని అక్రమ రవాణా చేయుచున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. పై తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్‌మెంట్ డిఎస్‌పి సిహెచ్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ టి లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎన్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శ్రీ మల్లికార్జున రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట నుంచి నరసరావుపేట వేళ్లే మార్గంలో పోలిరెడ్డి పాలెం ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది.పట్టణ ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కృష్ణారెడ్డి డొంక ప్రాంతానికి చెందిన కంభంపాటి సుధీర్ బాబు(39) ద్విచక్ర వాహనంపై నరసరావుపేట వైపు వెళ్తుండగా నరసరావు పేట నుంచి చిలక లూరిపేట వైపు వస్తున్న మినీ ట్రాన్స్ పోర్ట్ వాహనం ఢీకొందని దీంతో సుధీర్ బాబు రోడ్డుపై పడి తీవ్రగాయాల పాలై అక్కడికక్క డే మృతి చెందారన్నారు. సమాచారం మేరకు చిలకలూరిపేట 108 సిబ్బంది ఈఎంటి శోభన్ బాబు, పైలెట్ రాములు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే సుధీర్ బాబు మృతి చెందరాని తెలిపారన్నారు. ఇతనికి భార్య ,ఒక పాప ఉన్నారన్నారు. ఇతను సిఆర్ క్లబ్‌లో పర్యవేక్షణ మేనేజర్‌గా పనిచేస్తూ ఉండేవారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-తాడేపల్లి



మద్యం మత్తులో ఓ అడ్వకేట్ రాష్ డ్రైవింగ్ వల్ల తృట్టిలో ఇద్దరికి ప్రాణాపాయం తప్పిన సంఘటన మంగళవారం ఉండవల్లి సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాష్ట్ర హైకోర్టులో అడ్వకేట్‌గా పని చేసే చారుపల్లి వంశీకృష్ణ మద్యం తాగి కారు డ్రైవింగ్ చేసుకుంటూ ఉండవల్లి సెంటర్ వైపు నుంచి అమరావతి వైపు వెళ్తున్నాడు. ఉండవల్లి సెంటర్ డౌన్ వద్ద మెడికల్ షాపు సమీపంలో బుల్లెట్‌ను ఢీకొని 50 గజాల దూరం లాకెళ్లాడు. అంతకుముందు ఒక నిముషం ముందే . జొన్నా రాజేష్ తన చంటిపాపతో బుల్లెట్ పార్కు చేసి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రెండు నిముషాలు ముందు జరిగి ఉంటే వారిద్దరికి పెనుప్రమాదం జరిగి ఉండేదని తెలిపారు. కారు ఢీకొనడంలో బుల్లెట్ నుజ్జునుజ్జు అయ్యింది. దీనిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో జొన్నా రాజేష్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- మేడికొండూరు



మండలంలోని పేరేచర్ల జంక్షన్లో అక్రమంగా లారీలో తరలిస్తున్న 34 టన్నుల ప్రజా పంపిణీ బియ్యాన్ని మేడికొండూరు పోలీసులు పట్టుకున్నారు. మేడికొండూరు ఎస్ఐ కెవి కోటేశ్వరరావుకి వచ్చిన సమాచారం మేరకు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, పెరెచేర్ల సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి తనిఖీ చేస్తున్నారు. గుజరాత్‌కు చెందిన జిజే 36 వి 4855 గల లారీ, వట్టిచేరుకురు మండలం చమ్మళ్ళముడి గ్రామంలోని పద్మజ రైస్ ట్రేడర్ నుండి ప్రజా పంపిణీ బియ్యం లోడు చేసుకొని పేరేచర్లకు వస్తుండగా పట్టుకున్నారు. లారీలో ప్రజా పంపిణీ బియ్యం 34.240 టన్నుల బియ్యం గోతాలు గుర్తించారు. బియ్యం తరలిస్తున్న గుజరాత్‌కు చెందిన సోమ లాఖ, వాఘెల కార బాయిాల పై కేసు నమోదు చేశారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	125,799
మిర్చి ఎగుమతి	123,262
మిర్చి నిల్వ	91,091

మిర్చి ధరలు

	రూపాయలలో
334	11000 - 25000
నెం.5	10000- 24500
273	12000 -23500
341	10000 - 24000
4884	10000 -19500
సూపర్ 10	18000 - 22500
నాన్ ఎసి	
తేజ	9500 - 23000
బడిగి	10000 - 26500
దేవనూరు డీలక్స్	10800 - 25000
తాలుకాయలు	6500 - 13500



పతకాలు సాధించిన వారితో అసోసియేషన్ నాయకులు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు లిఫ్టర్ల సత్తా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా లిఫ్టర్లు సత్తా చాటారు. అమలాపురంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో సత్తెనపల్లికి చెందిన షేక్ నజీర్, గురజాలకు చెందిన కత్తి జ్యోతిబాబు పాల్గొన్నారు. 83 కిలోల విభాగంలో నజీర్ బంగారు పతకం సాధించగా జ్యోతిబాబు వెండిపతకం సాధించారు. వీరిని పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి పసుపులేటి సురేష్, అధ్యక్షులు జిమ్ రాజు, టి.శంకర్, ఎస్.మణిరత్నం, మధన్ అభినందించారు.



పరీక్ష సామగ్రిని అందిస్తున్న సురేంద్రబాబు తదితరులు

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఇంటర్ విద్యార్థినులందరూ పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని అభినందన ఆర్ఫన్ అండ్ నీడి సేవా సొసైటీ అధ్యక్షులు కందుల సురేంద్రబాబు అన్నారు. మండలంలోని గోళ్లపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి, రెండవ విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాగా చదివి జీవితంలో రాణించాలని, మంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. విద్యాపరంగా ఏమైనా అవసరం ఉంటే సొసైటీ తరుపున తాము సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి ఝాన్సీ, సొసైటీ సభ్యులు ఎం.కోటేశ్వరరావు, పి.రామారావు, ఉపాధ్యాయినులు మాధవి, ఎల్.రాజారాణి, బి.సౌజన్య, జి.జ్యోతి, ఎం.స్వాతి, టి.కల్యాణి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్, అధికారులు

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల

నెహ్రూనగర్ 3వ లైనులో ఫైర్ స్టేషన్ వద్ద 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్‌ల పనులు వేగంగా జరుగుతున్నట్లు కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. పనులను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.54 కోట్లతో బుగ్గవాగు తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ పథకంలో భాగంగా ఇంటింటికీ పైపులైను ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తామన్నారు. ఆయనవెంట ప్రజారోగ్య విభాగం ఎఇ మహమ్మద్ ఖాశీమ్, మెగా ఇంజినీరింగ్ ప్రతినిధి సాగిల బాలకోటిరెడ్డి ఉన్నారు.

సాగుకు అనువైన భూములుంటే పంపిణీ

ప్రజాశక్తి - నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మంగళవారం సమీక్షించారు. జగనన్న భూ హక్కు - భూ రక్ష పథకం సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, హద్దు రాళ్ల ఏర్పాటు విషయంలో ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. సర్వే చేసిన భూములకు వెంటనే భూహక్కు పత్రాల పంపిణి చేపట్టాలన్నారు. సర్వే కోసం దరఖాస్తు చేచుకున్న వారికి సత్వరం సర్వే చేసి



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్

ధ్రువపత్రాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి సాగుకు అనువైన భూములను ప్రజలకు పంపిణి నిమిత్తం చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా గుర్తించడం

రెవెన్యూ అధికారులతో సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

కోసం చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి సరైన నివేదికలు ఇవ్వాలని చెప్పారు. భూములను కొనుగోలు చేసిన యజమానులకు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా యాజమాన్య పత్రాలు ఇవ్వాలని, ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు నమోదుపై వివరాలు అడిగారు. ఓటర్ల జాబితా రూపకల్పన, ఆధార్ కార్డుల అనుసంధానం, మార్పులు, చేర్పుల తదితర పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెసి ఎ.శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్‌డిఒలు శేషిరెడ్డి, రాజకుమారి, అద్దయ్య, తహశీల్దార్లు పాల్గొన్నారు.



లెనిన్ నగర్ మహిళలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

అవినీతిని నిరూపిస్తే నా ఆస్తిని రాసిస్తా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

టిడిపి నాయుకులు చిల్లర రాజకీయాలు చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అర్థంపర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విమర్శించారు. పట్టణానికి మంగళవారం వచ్చిన ఆయన స్థానిక అర్ అండ్ బి బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. తాను అవినీతికి పాల్పడి హైదరాబాద్‌లో పెద్ద బిల్డింగ్‌లు నిర్మిస్తున్నానంటూ ఆరోపిస్తున్నారని, అయితే తాను అవినీతికే పాల్పడలేదని అన్నారు. తన తండ్రి కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో ఇప్పటికీ అద్దె అపార్టుమెంటులో ఉంటున్నారని చెప్పారు. తమ కుటుంబీకులు వ్యాపారాలు చేసి కొంత సంపాదిస్తున్నారేగాని, అధికారాన్ని అడ్డు పెట్టుకుని సెంటు భూమి కూడా తాము సంపాదించలేదని అన్నారు. నర్సరావుపేటలో కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్న స్థలాన్ని 1978లో కోనుగోలు చేయగా అప్పటి నుండి బ్రహ్మానందరెడ్డి కాలేజీని నిర్వహిస్తున్నారని, కాలేజీ నిర్వహణ కోసం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని, ఇందుకు అన్ని రకాల అనుమతులు 2008లోనే వచ్చాయని వివరించారు. ప్రభుత్వం ఎయిడెడ్ తొలగించడంతో నిర్వహణ భారం పెరిగిందని, అందుకే రూ.20 కోట్ల లోన్ తీసుకుని ఈ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని అన్నారు. 2014కు ముందు ఎటువంటి ఆస్తులు లేని యరపతినేని టిడిపి అధికారంలో ఉండగా గుంటూరులో రూ.40 కోట్లతో ఇల్లు ఎలా నిర్మించారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. తన అవినీతిని నిరూపిస్తు ఆస్తినే రాసిస్తానని సవాల్ విసిరారు.

బైపాస్ నిర్మాణంపై మాట్లాడుతూ ఏప్రిల్ 14లోగా పూర్తి చేయకపోతే టోల్ నిలిపివేస్తామని అన్నారు. ప్రభుత్వం నుండి అనుమతులు, నిధులు వచ్చాయని, ఏప్రిల్ 14 నాటికి పూర్తి చేస్తామని క్యూబ్ సంస్థ చెప్పిందని తెలిపారు. అన్నమాట ప్రకారం పూర్తవకుంటే తామే ధర్నాలు చేస్తామన్నారు.

లెనిన్ నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ఇళ్ల పట్టాల కోసం 25 ఏళ్లుగా ఎదురు చూస్తున్న లెనిన్ నగర్ వాసుల సమస్యను 25 రోజుల్లో పరిష్కరించామని ఎమ్మెల్యే అన్నారు. ఈమేరకు కాలనీలో 500 పట్టాలను పంపిణీ చేశారు. ఈ కాలనీని కమ్యూనిస్టులు ఏర్పాటు చేయగా గత నెలలో 32, 33 వార్డుల్లో నిర్వహించిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పట్టాల కోసం వినతులు వచ్చాయని చెప్పారు. దీనిపై తహశీల్దార్‌తె వెంటనే చర్చించి పట్టాలను సిద్ధం చేశామని అన్నారు. కృష్ణా నీటిని మెదట ఈ ప్రాంతానికే అందించామని, అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. మరో 250 పట్టాలు 15 రోజుల్లో ఇస్తామన్నారు. కార్యక్రమానికి వైసిపి పట్టణ అధ్యక్షులు చింతా రామారావు అధ్యక్షత వహించగా తహశీల్దార్ చక్రవర్తి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వార్తలు షేర్ చేస్తే బెదిరిస్తారా?

పోలీసుల తీరుకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - దాచేపల్లి

రేషన్ మాఫియాపై పత్రికలో వస్తున్న వార్తను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నందుకు మండలంలోని బట్రుపాలేనికి చెందిన యువకుణ్ణి పోలీసులు స్టేషన్‌కు పిలిపించి భయపెట్టడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి ఆంజనేయరాజు ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. గత ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడే ఓటమిని చవి చూసిందని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాలరాయొద్దని సూచించారు. ప్రభుత్వం మారినా అనేక దందాలు, అవినీతి కార్యకలపాలు కొనసాగుతునే ఉన్నాయని, వాటిని చేసేవారే మారారని విమర్శించారు. నిర్బంధ చర్యలను ప్రభుత్వం మానుకోవాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై నేడు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - నరసరావుపేట

వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో అవగాహన సదస్సు ఉంటుందని కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి మంగళవారం తెలిపారు. వినియోగదారుల హక్కులపై సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సదస్సులో ప్రముఖ న్యాయవాదులు వివరిస్తారని పేర్కొన్నారు. వస్తువుల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోసపోతే న్యాయ పోరాటం ఎలా చేయాలి? అనే విషయాలపై న్యాయవాదులు మేరీ బ్లాసిన, జె.హనుమంతరావు, వి.శరత్ బాబు, ఎస్.ప్రసాద్, ఎ.ఏడుకొండలు వివరిస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొనాలని, వివరాలకు 92464 93157 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తమను విధుల నుండి తొలగించారని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కాంట్రాక్టు సిబ్బంది మంగళవారం కలిసి విన్నవించారు. విధులకు సరిగా హాజరు కాలేదనే కారణంతో మండలంలోని రామకష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 8 మంది కాంట్రాక్టు సిబ్బందిని ఇటీవల తొలగించారు. ఫిబ్రవరి 12న జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కాకపోవడంతో సెక్యూరిటీ గార్డులు, స్లీపర్లు, వాచ్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, జిల్లా సమన్వయకర్త శాంతివిశాల సిఫార్సు చేశారు. దీంతో వారిని తొలగించడంతో వారంతా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.



మంచు ప్రభావం.. ఎండ ప్రతాపం..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణాన్ని మంగళవారం ఉదయం 7.30 గంటల వరకూ మంచు కంప్పేయగా అనంతరం భానును తీవ్రతను చూపాడు. గరిష్ఠంగా 36 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి తీవ్రత మరింత పెరుగుతుందని, ప్రజల జాగ్రత్తలు పాటించాలని అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.



5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

కార్మిక, కర్షక ర్యాలీలో పాల్గొనాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం - కరపత్రాలు పంపిణీ


పెదకాకానిలో


తాడేపల్లి పట్టణంలో

ప్రజాశక్తి - మంగళగిరి

సిఐటియు పెదకాకాని మండలం కమిటీ ఆధ్వర్యంలో పెదకాకానిలో చలో ఢిల్లీ జయ ప్రదం చేయాలని మంగళవారం పెద కాకానిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏపీ గ్రామపంచాయతీ ఎంపా ్లయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు సమావేశం పి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గ్రామపంచా యతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మాస్కులు, గ్లౌజులు యూనిఫామ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని వెంటనే టెండర్ ప్రతిపాదనలు పంపించి ఆమోదించి ఆర్డర్ కాపీ వెంటనే ఇవ్వాలని, సబ్బులు నూనె వారాంతపు సెలవులు క్యాజువల్లు లీవులు ఇవ్వాలని పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రతినెల జీతాలు ఇవ్వాలని నెలలు తరబడి జీతాలు ఇవ్వటం లేదని ఫిరంగిపురంలో పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించ లేదని వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు అన్ని పంచాయతీల నుండి వారికి సంఘీభావంగా మద్దతు తెలుపుతున్నామని తక్షణమే ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీన మండల కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మటాన్ని ఉపసరించుకోవాలని భవన నిర్మాణం ఆటో ట్రాన్స్పోర్ట్ అసంఘటితరంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలు పోగు సుజాత ,కే సంతోష్ ,కొండ రాజకుమారి, వి శోభ, మల్లేశ్వరి, యం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి-తాడేపల్లి : ఏప్రిల్ 5న కార్మిక, కర్షక రైతు ర్యాలీకి పెద్దఎత్తున ఢిల్లీ తరలిరావాలని సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తెల్లక్వారీ, 11వ వార్డు సచివాలయం బజారు, రామయ్యకాలనీ దక్షిణ భాగంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ గ్రూపు మీటింగుల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యావసర సరుకుల ధరలను ప్రజలు మోయలేని విధంగా భారాలు మోపిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.ప్రసాద్, సిహెచ్.రేణుక, వి.కుమారి, ఎస్కె హసీనా తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక కర్షకులు తలపెట్టిన కార్మిక, కర్షక ర్యాలీని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. మతోన్మాద బిజెపి విధానాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల నాయకులు వడ్డేశ్వరం పున్నయ్య, వడ్డేశ్వరం మరి య బాబు, షేక్ నన్నే తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు : మండల కేంద్రమైన మేడికొండూరు ఎన్టీఆర్ కాలనీలో మండల కౌలు రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల: దుగ్గిరాల మండలం చిలురువూరులో చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కరపత్రాలు ప ంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరావు రైతుసంఘం జిల్లా నాయకులు వి. సాంబశివరావు యన్ సాంబయ్య టి. రామారావు కె. సుబ్బారావు శ్రీనివాస్ వై. బాలస్వామి పాల్గొన్నారు.


మేడికొండూరులో


దుగ్గిరాలలో


వడ్డేశ్వరంలో



మల్కాపురం జంక్షన్ వద్ద పోలీస్ బందోబస్తు

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ట బందోబస్తు


ప్రజాశక్తి - తుళ్లూరు

మంగళవారం నుంచి శాసనసభ సమావేశాల నేపథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. ప్రధాన మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటుచేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం సచివాలయంకు వెళ్లేందుకు అనుమతించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు, మందడం - వెంకటపాలెం ఆర్ అండ్ బి రోడ్డుపై బాంబ్ స్క్వాడ్ బందాలు విస్తత తనిఖీలు జరిపాయి. మల్కాపురం జంక్షన్ వద్ద నుంచి ఆర్టీసి బస్సులు, ఇతర వాహనాలను సచివాలయం వద్దకు వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కాలినడకనే సచివాలయంకు చేరుకున్నారు. మందడం, వెంకటపాలెం, వెలగపూడి, తుళ్లూరు రైతు దీక్షా శిబిరాల వద్ద పోలీసులు కాపలా కాశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్‌లు అమలులో ఉన్నందున రైతులు, ఇతరులు ఎలాంటి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టవద్దని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న నేతాజీ తదితరులు

2వ రోజు ఆకలిపోరులో వినూత్న నిరసన


విరాళం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- ఫిరంగిపురం

గ్రామపంచాయతీలలో అమలు చేస్తున్న టెండర్ విధానాన్ని రద్దు చేసి టెండర్ కార్మికులందరినీ నిరవధి కంగా కొనసాగిం చాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. మంగళవారం ఫిరంగిపురంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న రెండవ రోజు ఆకలిపోరు నిరసనలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నేతాజీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గ్రీన్ అంబాసిడర్లకు గ్రామపంచాయతీల నిధుల నుండే జీతాలు చెల్లించాలని చెప్పడం సరికాదని ఆదాయం తక్కువగా ఉండే చిన్న పంచాయతీలలో గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించే పరిస్థితి లేదని, ప్రభుత్వమే వీరికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఫిరంగిపురం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కె మస్తాన్ వలి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా చిన్న ఉద్యోగులందరికీ రూ.10 వేలకు తక్కువ లేకుండా జీతం చెల్లిస్తామని వాగ్దానం చేశారని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, టెండర్ కార్మికులు అత్యధిక మందికి నేటికీ పదివేల జీతం రావడంలేదని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు సిహెచ్ రామారావు, మండల నాయకులు ఓర్సు బాలయ్య, నరసింహారావు, కే పూర్ణచంద్రరావు, పాలపర్తి కోటేశ్వరరావు, రావిపాటి సత్యనారాయణ, మేడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మద్దతు

గ్రామపంచాయతీ కార్మికుల “ఆకలి పోరు” కు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మద్దతు ప్రకటించింది. యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండ్లమూడి ప్రసాద్, కార్తీక్ శ్రీనివాసరావు పోరాట శిబిరాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్స్ న్యాయమైనవని ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పోరాట సంఘీభావ నిధి వెయ్యి రూపాయలు అందించారు.

పోక్సో కోర్టు స్పెషల్ పిపిగా మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి - తెనాలి : స్థానిక కోరులో నూత నంగా ఏర్పాటు చేసిన పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా దాట్ల మోహన్ రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ క్లాసిక్యూషన్స్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోహన్ రెడ్డి ప్రస్తుతం 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. మోహన్ రెడ్డి నియామకంపై బార్ అసోసియేషన్ బృందం, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.



నెహ్రూ నికేతన్‌లో క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభ మయ్యాయి. డైరెక్టర్ మురళీకాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన క్రీడోత్సావాల్లో పట్టణ ఒన్‌టౌన్ సిఐ కె.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి, శారీరక వ్యాయా మానికి, విద్య ఉపాధి అవకాశల్లో ప్రత్యేక కోటాకు ఉపకరిస్తాయన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ప్రతిభావంతు లుగా ఎదగాలన్నారు. అలాగే క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాల న్నారు. మురళీకాంత్ దాసరి మాట్లాడుతూ దేశ, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. పాఠశాల తరపున సిఐను ఘనంగా సత్కరిం చారు.



గ్యాస్ వినియోగదారులకు బహుమతులు

ప్రజాశక్తి - మంగళగిరి : గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని హెచ్‌పిసి జనరల్ మేనేజర్ అవినాష్ జైన్ అన్నారు. మంగళవారం గౌతమ్ బుద్ధ రోడ్ లోని బ్యాకేంట్స్ హాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్యాస్ డీలర్ల సమావేశం సేల్స్ మేనేజర్ జై జగదీష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం అక్టోబర్ నుండి ఈ సంవత్సరం జనవరి 23 వరకు కొత్త కనెక్షన్‌లకు ఇచ్చిన స్క్రాచ్ కార్డుల వినియోగదారులకు మెగా బంపర్ బహుమతులు సురక్ష మిత్ర పథకం ద్వారా అంద జేశారు. మూడు ఈ బైకులు, మూడు వెట్ గ్రైండర్స్, మూడు మిక్సీలు, 3 ఎయిర్ కూలర్స్, మూడు సెల్ ఫోన్లు, కుక్కర్లు, సిలిండర్ ట్రాలీలు అందజేశారు. 82 మంది ప్రతిభావంతులైన గ్యాస్ డెలివరీ బాయ్స్ కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం నారాయణ, మేనేజర్ ఎం శ్రీనివాస్, నన్నపనేని నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల సమస్యలపై ఎపి జెఎసి అమరావతి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆరవ రోజూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. నిరసనల్లో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదుట పంచాయతీరాజ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. వారికి ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ కనపర్తి సంగీతరావు, సెక్రెటరీ కిరణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల హక్కుల కోసమే తమ పోరాటమని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని చెబుతున్న ప్రభుత్వం ఉద్యోగుల వేదనను ఆలకించకపోవటం బాధాకరమన్నారు. ఉద్యోగులు ఎంతో ఓర్పుతో ఉంటున్నారన్నారు. జీతాలు కూడా సకాలంలో అందక దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. అనేక సార్లు చర్చలకు పిలిచి హామీ ఇచ్చినా, దానికి నిలబెట్టుకోలేకపోయిందని, ఎవరికి చెప్పుకోవాలో తెలియక నిరసన జెండా పట్టుకున్నామని చెప్పారు.


నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ప్రయోగాల మూట నాటునాటు పాట

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సంప్రదాయాలు, సంస్కృతుల ప్రయోగాల మూట 'నాటు నాటు' పాట అని రాష్ట్ర తెలుగు భాషా విశిష్ట పురస్కార గ్రహీత, జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ దార్ల బుచ్చిబాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు ఆచార వ్యవహారాలు పాటలో ప్రస్ఫుటంగా ప్రతిబింబించాయని, ఈ పాటకు అస్కార్ అవార్డు రావడం తెలుగువారికి దక్కిన అరుదైన గౌరవమని చెప్పారు. అందరిని కలిపే, కదిలించే శక్తి పాటకే ఉందని, ఉత్సాహవంతులైన విద్యార్థులకు పాటల రచనలో మెలకువలు నేర్పిస్తే పాటల రచయితల సంఖ్య పెరుగుతుందని అన్నారు. బాల్య దశ నుంచి పిల్లల్ని కళల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.



పనులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్, తదితరులు

పారిశుధ్యానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యానికి ప్రపాధాన్యం ఇస్తున్నట్లు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 15వ వార్డు కొండలరావుపేటలో పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. డ్రెయినేజీ కాల్వల్లో మురునీరు పారుదలకు అంతరాయం లేకుండా చూడాలని, పూర్తిస్థాయిలో పూడిక తీయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బందికి కృషి ప్రజలూ సహకరించాలని కోరారు. పరిశీలనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, వార్డు సెక్రటరీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



తరగతి గదిలో పరిశీలిస్తున్న ఎంఇఒ లక్ష్మి

విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి : ఎంఇఒ

ప్రజాశక్తి - చిలకలురిపేట : స్థానిక కెవిఆర్ నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి కె.లక్ష్మీ మంగళవారం సందర్శించారు. నిర్మాణాత్మక మదింపు (ఎఫ్ఇ)-4 పరీక్షల నిర్వహణను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరీక్షల అనంతరం పరీక్షల అనంతరం విద్యార్థుల వారీగా మార్కులను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా మధ్యాహ్న భోజన అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఎడ్యుకేషన్ సెక్రటరీ కామేశ్వరరావు, రాధిక పాల్గొన్నారు.

బెజగం రవికుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో సత్తెనపల్లికి చెందిన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ పాల్గొన్నారు. తెలుగు భాషా ప్రాధాన్యాన్ని తెలిపే 'తెలుగదేలయన్న దేశంబు తెలుగు' పద్యాన్ని ఆలపించారు. అనంతరం ఈయన్ను నిర్వాహకులు సత్కరించారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ



రెంటచింతల మండలంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపిపి డి.చౌడేశ్వరి, అధికారులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పల్నాడు జిల్లాలోని పలు పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు మంగళవారం ఆంల్బెండజోల్ మాత్రలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొనడంతోపాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యం, ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పెదకూరపాడు మండలం తాళ్లూరు జూనియర్ బేసిక్ పాఠశాలలో మందుల పంపిణీని ఎంపిడిఒ ఎంపిడిఒ నరసింహారావు, డాక్టర్ వెలుగొండ రెడ్డి ప్రారంభించారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విద్యా సంస్థల్లో మందుల పంపిణీలో ఎంపిడిఒ హనుమారెడ్డి, తహశీల్దార్ నాగమల్లీశ్వరావు, లింగరావుపాలెం సర్పంచ్ మాబు సుభాని, ఎంపిటిసి రాఘవయ్య పాల్గొన్నారు. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంలోని 139 అంగన్వాడీ కేంద్రంలో మాత్రలను డాక్టర్ కెవి.కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు బాజీ, మంగమ్మ, అంగన్వాడీలు టి.మల్లేశ్వరి, సిహెచ్ ఆశాజ్యోతి పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ మహబూబ్ అలీ 13వ సచివాలయం వద్ద గవర్నమెంట్ బాలికల హైస్కూల్‌లో మందులను పంపిణీ చేశారు. డాక్టర్ మహబూబ్ అలీ, ఫార్మసిస్టు అన్వర్ హుస్సేన్ ఖాన్, ఎఎన్ఎం రత్నపుణ్యవతి, శాంత కుమారి, ఆశా వర్కర్ ప్రియాంక, పర్వీన్, హెచ్ఎం విజయ పాల్గొన్నారు. ఈపూరు మండలంలోని కొచ్చర్ల జెడ్‌పి పాఠశాలలో మందుల పంపిణీని సర్పంచ్ కోపెల దేవరాజ్ ప్రారంభించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగేంద్రబాబు హెచ్ఎం శ్రీరాములు, ప్రత్యేక అధికారి డాక్టర్ హనుమకుమార్, ఎంపి హెచ్ఇఒ కె.సాంబశివరావు, ఎంపీహెచ్ఎ బి.శివకృష్ణ, ఎఎన్ఎం సీతాబాయి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. నూజెండ్ల జెడ్‌పి పాఠశాలలో మందుల పంపిణీలో ఎంపిపి ఎం.జయరామిరెడ్డి, జెడ్‌పిటిసి జె.రామయ్య, ఎంపిడిఒ జిలానిబాషా, నక్కా నాగిరెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్ బాబు, రాధిక పాల్గొన్నారు. రొంపిచర్ల మండలంలోని పలు పాఠశాలల్లో మంత్రలు పంపిణీ చేయగా తహశీల్దార్ జి.అంకారావు, వైద్యాధికారి డాక్టర్ స్వాతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అమరావతి మండలంలో మందుల పంపిణీని డాక్టర్ రవిబాబు, డాక్టర్ శివరత్న కుమార్, ఎంపిడిఒ పి.మాధురి, తహశీల్దార్ విజయశ్రీ ప్రారంభించారు. రెంటచింతల మండలంలోని ఎంపిపి డి.చౌడేశ్వరి, తహశీల్దార్ కె.పుల్లారావు, ఎంఇఒ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి కృష్ణారెడ్డి తదితరులు విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు.



ఈపూరు మండలం కొచ్చర్లలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న సర్పంచ్ కె.దేవరాజ్

రబీలో పంటలన్నీ ఈ-క్రాప్‌లో నమోదు

ప్రజాశక్తి - నాదెండ్ల

రబీలో సాగైన పంటలన్నింటినీ ఈ-క్రాప్‌లో నమోదు చేశామని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి తెలిపారు. మండలంలోని సాతులూరు రైతు భరోసా కేంద్రంలో ఇ-క్రాప్ నమోదు సామాజిక తనిఖీ గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ ఇకెవైసి ద్వారా ఈ-క్రాప్‌లో నమోదైన రైతులను ధ్రువీకరించామని, ఆ వివరాలను రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మొక్కజొన్న, శనగ సాగు గతంకంటే పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు రవికుమార్, మస్తానమ్మ, హరిప్రసాద్, సిహెచ్ రమేష్‌బాబు, రామారావు, బి.రామారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - మాచర్ల

పేదలకు వైఎస్ఆర్ బీమా ఆర్థిక భరోసాను అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు అన్నారు. పట్టణంలోని వినాయకుని గుట్ట ప్రాంతానికి చెందిన కంభంపాటి ఏలియా మృతి చెందగా మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను మృతుని భార్య గురవమ్మకు కమిషనర్ మంగళవారం అందించారు. గురవమ్మకు వైఎస్ఆర్ బీమా మొత్తం, వితంతు పెన్షన్ తదితర ప్రభుత్వం నుండి అందవలసిన పథకాలను సకాలంలో అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ కరీమూల్లా, వి.గురవయ్య, వి.దాసు, కె.భాస్కరరావు, అన్నారావు, ఆనంద్ పాల్గొన్నారు.




నగదును అందిస్తున్న కమిషర్ తదితరులు

మునుగోడు హైస్కూల్లో ఐన్‌స్టీన్ జయంతి

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని మునుగోడు జడ్‌పి హైస్కూల్లో ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆధునిక భౌతికశాస్త్రానికి మూలమైన సాధారణ సాపేక్షత సిద్ధాంతాన్ని ప్రతిపాదించడంతో పాటు, ప్రపంచంలో అత్యంత ప్రముఖ ఫార్ములా అయిన మాస్ ఎనర్జీ ఈక్వివలెన్స్ ఫార్ములాను కనిపెట్టాడని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కె.సలావుద్దీన్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు చంద్రయ్య, కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐన్‌స్టిన్‌కు నివాళులర్పిస్తున్న హెచ్ఎం తదితరులు



పేదల మధ్య వివాహ వార్షికోత్సవం

ప్రజాశక్తి - మాచర్ల

డాక్టరు దశరథ్, డాక్టర్ సౌమ్య 9వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్య కిరణ్ దివ్యాంగుల పాఠశాల, లేప్రసీ కాలనీలోని పేదలకు మంగళవారం అన్నదానం చేశారు. ప్రముఖ వైద్యులు, సీనియర్ రోటేరియన్ రామకోటయ్య మాట్లాడుతూ వీరిని ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని, శుభకార్యాలప్పుడు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రముఖ ఆడిటర్ షేక్ మస్తాన్‌వలి, సత్యప్రసాద్, కోశాధికారి నాగార్జునరెడ్డి, క్లబ్ సభ్యులు నాగుర్‌వలి మాస్టార్, శివా మెడికల్ రామమూర్తి, డేకరేషన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలో 31, 1వ వార్డు జంక్షన్లోని కవయిత్రి మొల్ల విగ్రహం వద్ద ఆమె జయంతిని డాక్టర్ నిజాంపట్నం అమరేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, 1వ వార్డు కౌన్సిలర్ వి.కోటేశ్వరరావు, ఎస్.మాణిక్యాలరావు, ఎస్.ఈశ్వరరావు, డి.రామకోటయ్య, కె.హరి, ఆర్.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

37వ వార్డు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి 37వ వార్డు నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆవుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కన్నెగంటి సాయి, కార్యదర్శిగా నాగేశ్వరరావు ఎన్నియ్యారు. వీరికి వార్డు కౌన్సిలర్ పి.శివకుమారి, నాయకులు టి.శ్రీహరి, ఎ.గోపి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 15 మార్చి 2023

మొక్కజొన్నలో దిగుబడి దిగులు

- ఎకరాకు 35 నుంచి 30కి తగ్గిన దిగుబడి
- ఏడాది గడిచినా పెరగని ధర

ప్రజాశక్తి- దుగ్గిరాల

రబీ సీజన్లో రైతన్నలని ఆపద్బాంధవుల ఆదుకునే మొక్కజొన్న దిగుబడి తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు రైతన్నలు తెలిపారు. గత ఏడాది ఎకరాకు సగటున 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ఈ ఏడాది 30 క్వింటాళ్లకు పడిపోయేలా ఉందని రైతులు వాపోతున్నారు. అయితే గత ఏడాది నూర్పిల్లలో రూ.1950 నుండి రూ.2వేలకు



మండల పరిధిలో కోతకోసి ఆరబోసిన మొక్కజొన్న

కొనగోలు ధర ఉందని, ప్రస్తుతం అదే ధరలు కొనసాగుతున్నాయని తెలిపారు.మండల వ్యాప్తంగా 22వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతుంది. అయితే డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు విత్తనాలు అధిక శాతం కుళ్ళిపోవడంతో తిరిగి జనవరిలో విత్తడం వలన దాదాపు 20 రోజులు పంట వెనుకబడినట్లు రైతులు వాపోతున్నారు. నూరుపిళ్ల మొదలవుటానికి ఇంకా నెలరోజుల సమయం ఉన్నప్పటికీ అక్కడక్కడ మొక్కజొన్న కండెలు విరుస్తున్నారు. విరిచిన కండలు చేలలో పంట అంచనా వేయగా , ఈ ఏడాది సగటు దిగుబడి 30 క్వింటాళ్ల వరకు ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కొత్త పంట చేతికి వచ్చేనాటికి ఈ ధరలు ఉంటాయా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తిన తర్వాత నేటికి వర్షం కురవలేదని, నీటి తడుపుల కోసం నానా ఇబ్బందులు పడి పంటను రక్షించుకున్నామని ధరలు లేకుంటే నష్టాలు పాలవుతామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇవే ధరలు కొనసాగి కొంత నష్టాల నుంచి బయట పడతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్ఐసి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అదానీ దోచుకున్న సంపదను రీకవరీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి కొత్తపేటలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఎస్‌బిఐ, ఎల్ఐసిల వద్ద ఆదానీ దోసుకున్న సంపదను రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ ఎస్‌బిఐ, ఎల్ఐసిల నుంచి సంపద దోచుకున్న ఆదానీకి, అండగా ఉన్న మోడీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశబోయిన శ్రీనివాసరావు, కె.జీవన్ సాగర్, కె.కృష్ణారావు చౌదరి, గోలి సాంబశివరావు, షేక్ సుభాని, షేక్ చాంద్ భాష తదితరులు పాల్గొన్నారు.



రుణాలను అందజేస్తున్న డైరెక్టర్ షిరీన్ బేగం

వడ్డీ రహిత రుణాలు పంపిణీ

ప్రజాశక్తి- మంగళగిరి:ఖిద్మత్ మ్యుచ్‌వల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మంగళగిరి బ్రాంచ్‌లో పొదుపు చేసుకుని, మూడు నెలల కాల పరిమితిని పూర్తి చేసుకున్న సభ్యులకు ఖిద్మత్ మాక్స్ లిమిటెడ్ తరపున ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ షిరీన్ బేగం మంగళవారం రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా షిరీన్ బేగం మాట్లాడుతూ సామాజిక సేవ దృక్పధము కల మరింతమంది ఈ సంస్థలో సభ్యులుగా చేరి తమ పొదుపు మొత్తాలను జమచేసి ఈ సంస్థ అబివృద్ధిలోనూ, వడ్డీ రహిత సమాజ స్థాపనలోనూ భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఖిద్మత్ సొసైటీ జిల్లా అధ్యక్షులు షేక్ జాహిద్ , జిల్లా డైరెక్టర్ షేక్ సిలార్ , మంగళగిరి బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులు నిజాం , అజీమ్ , మగ్బూల్ , బాబావలి , బ్రాంచ్ మేనేజర్ షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి -మంగళగిరి:మంగళగిరి పట్టణంలోనూ, టిడ్కో గృహ సముదాయంలోనూ తాగునీటి సమస్యను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి విఫలమయ్యారని టిడిపి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గృహ సముదాయానికి తాగునీరు అందించే పంపింగ్ స్కీంకు కరెంట్ బిల్లు చెల్లించేదని అధికారులకు తెలియదనడం విడ్డూరంగా ఉందని అన్నారు. పట్నంలోని వివిధ ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టీ జానకి దేవి, ఎ. భూలక్ష్మి, కె.ఎంకమ్మరావు, షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, జి. దుర్గారావు, జి. రాఘవ, బి. వినోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.



కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మంగళగిరి

గత కొన్ని ఏళ్లుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న గుంటూరుకు చెందిన జ్యోతికి వారి మందుల ఖర్చుల నిమిత్తం ఆమె భర్త శ్రీనివాసులుకు మన విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ తరపున విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆఫీస్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ చేతుల మీదగా రూ. 5వేల చెక్కును ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కాగితాల స్వాతి, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ట్రెజరర్ బొడ్డేటి రమేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తిరువీధుల కిరణ్ ఉడత శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఎప్రిల్ 2 నుండి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - గుంటూరు

జేఈఈ, నీట్, ఈఏప్ సెట్ ఉచిత శిక్షణా తరగతులు ఏప్రిల్ 2 నుండి నిర్వహిస్తున్నట్లు లెక్కల అధ్యాపకుడు మరియు యువ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ గౌరవ అధ్యక్షులు పులుగు దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం విజయవాడ, గుంటూరు మరియు ఇతర జిల్లాలోని ఇంటర్ విద్యార్థులకు ఆన్లైన్ ద్వారా క్లాసులు అందించామని, ఈ సారి ప్రతి మండల హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రభుత్వ పాఠశాల, కాలేజీలో డిజిటల్, సెల్‌ఫోన్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు యూట్యూబ్ ఛానల్, జూమ్ యాప్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని, ఉచిత శిక్షణకు హాజరు కావాలనుకునే విద్యార్థులు 7780150751కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దీపక్ కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి: కోరమండల్ ఇంటర్‌నేషనల్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో తాడేపల్లి కృష్ణా కెనాల్ గూడ్స్ షెడ్‌లో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రైల్వే కార్మికులు, లారీ యజమానులు, డ్రైవర్లు, రైల్వే సిబ్బంది వైద్య సేవలు పొందారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎన్ విజయభాస్కర్, కోరమండల్ రీజనల్ లాజిస్టిక్ మేనేజర్ రవి, అవేజ్ లిమిటెడ్ విజయవాడ మేనేజర్ ఎల్‌బి స్వరూప్, వైద్యులు పాల్గొన్నారు.



వెంకటరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

కళాకారుడు వెంకట్రావుకు సత్కారం

ప్రజాశక్తి- తెనాలి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బోస్ రోడ్డులోని పెమ్మసాని థియేటర్లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన గుండమ్మ కథ చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు పెరుగు వెంకటరావును సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఎస్. నాగేశ్వరరావు, ఈ. శ్రీనివాసరావు, ఐ.మల్లేశ్వరరావు, పి.రమాదేవి, డిఎల్ కాంతారావు, ఎం. కోటేశ్వరరావు, డి. భవాని,ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, శేషు, మధు, సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

బాధితుడికి కొమ్మారెడ్డి వితరణ

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఏంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామానికి చెందిన, టిడిపి కార్యకర్త గుడివాడ కిరణ్‌కు, వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ మంగళవారం రూ.10 వేల నగదును కిరణ్ నివాసానికి వెళ్లి అందజేశారు. టిడిపి కార్యకర్తలకు పార్టీ అన్ని వేళల అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు చిగురు పాటి సుబ్బారావు, నామ తోటి నాగరాజు, తురక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి విద్యాశాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.పాఠశాలలో అన్ని రకాల సమగ్ర శిక్ష యాక్టివిటీస్ పై నాడు-నేడు ఫేస్ -2 అభివృద్ధి పనులపై సిబ్బందితో సమీక్షించారు.పెండింగ్ ඃలో వున్న నిధులు తదితర అంశాల పై ఎంఈఓ రుద్రపాటి శోభచంద్ ను అడిగి తెలుసుకున్నారు.



చినకాకాని కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజిని, కలెక్టర్



తెనాలి కెఎస్ఎం పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న సయ్యద్ ఖాలేదా నసీమ్

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

మంగళగిరి రూరల్: మండలంలోని చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని పాల్గొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను మంత్రి రజిని ఆవిష్కరించారు. నులిపురుగుల నిర్మూలణకు ఆల్ బెండజోల్ మాత్రను విద్యార్థులకు మంత్రి విడుదల రజిని, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ గీత శర్మ, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మంగళగిరి:మంగళగిరి వీవర్స్ కాలనీలోని నగర పాలకసంస్థ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం గణపతి నగర్ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేశారు. ముఖ్యఅతిథిగా హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పీ అనూష హాజరై విద్యార్థిలకు టాబ్లెట్లు వేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ శ్రీనివాస్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం ఉషలక్ష్మి, ఏఎన్ఎంలు ఝాన్సీ, విజయ కుమారి, ఆశాలు లక్ష్మీకాంతం, తిరుపతమ్మ, అంగన్వాడీ టీచర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను తహశీల్దార్ షేక్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాల సుబ్రమణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వింజనంపాడులో

వట్టిచెరుకూరు మండల పరిధిలోని వింజనంపాడు సిఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన కొరకు ఆల్బెండజోల్ మాత్రలను కాట్రపాడు పిహెచ్‌సి వైద్యాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు అందజేశారు.ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి సుధీర్, వీరయ్య, ఆరోగ్య సిబ్బంది కె శేషగిరి రాజు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. తుళ్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎఎన్ఎం అమృతవల్లి రాయపూడిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్) ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.**కొల్లిపర :** వైద్యాధికారిని డాక్టర్ చిక్కాల లక్ష్మీ సుధా మంగళవారం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ భీమవరపు పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసులు డాక్టర్ వేముల ప్రియాంక, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు గణేషు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.**తెనాలిరూరల్:** తెనాలి కెఎస్ఎం పాఠశాలలో వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల పాల్గొన్నారు. జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణ పర్యవేక్షణలో విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగు మాత్రలు వేసుకున్నారు.

చేతిరాతపై ప్రజ్ఞలో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులకు ప్రాథమిక దశనుండే చక్కటి చేతిరాత అలవాటు చేస్తూ, వారి మానసిక ఎదుగుదలకు పునాదులు వేస్తున్నామని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం పాఠశాలలో లూసిడా హ్యాండ్ రైటింగ్ శిక్షకులు రవికుమార్ నేతత్వంలో విద్యార్థులకు చేతి వ్రాతపై శిక్షణ ఇచ్చి వారికి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా చక్రనాగ్ మాట్లాడుతూ అందమైన చేతిరాత రాసే విద్యార్థులు మానసికంగా చక్కటి పరిపక్వత కలిగి, అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉంటారని చెప్పారు. తద్వారా ప్రతి సబ్జెక్టుపై పట్టు కలిగి ఆసక్తితో నేర్చుకొని, మంచి మార్కులు సాధిస్తారన్నారు. అరహస్యాన్ని గుర్తుంచి, తాము ప్రాథమిక దశ నుండే చక్కటి చేతి రాత రాసే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు ఇంచార్జ్ షేక్ సిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందచేస్తున్న కరస్పాండెంట్ చక్రనాగ్ తదితరులు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శరణ్యరామ్

వ్యక్తిత్వ వికాసంపై మలినేనిలో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు మంగళవారం ఐ.టి కర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ సీఈవో శరణ్యరామ్ నంబులతో మోటివేషనల్ అండ్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. నేటితరం విద్యార్థులు తమ జీవితంలో ఉత్తమ స్థితికి చేరటానికి కావాల్సిన జీవిత నైపుణ్యాలని పరిజ్ఞానాన్ని ఏ విధంగా సంపాదించుకోవచ్చు, అంకితభావంతో పట్టుదలతో ఎలా ప్రవర్తించాలి, వారి వారి లక్ష్యాలను ఎలా చేరుకోవాలి, విద్యార్థులు తమ జీవితంలో వచ్చే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొని విజయాలను ఎలా చేరుకోవాలి, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థిని తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని వ్యక్తిగత ప్రతిభతో ఎలా రాణించాలి తదితర అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, అకడమిక్ అడ్వైజర్ జంపని కిషోర్‌బాబు, డైరెక్టర్ డి.శ్రీనివాస్‌కుమార్ హెచ్ఓడి డాక్టర్ ఎ.ఎస్.కే చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిని వేగవంతం చేయాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం గాంధీ పార్క్, చుట్టగుంట వాకింగ్‌ట్రాక్, జంక్షన్ తదితర ప్రాంతాల్లో పరిశీలించి, అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధిపై నగరపాలక సంస్థ స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టిందన్నారు. నగరంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధిచేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని, గాంధీ పార్క్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. గాంధీ పార్కులో మెయిన్ గేటు ఆర్చి, నేమ్ బోర్డ్ ఏర్పాటు అయ్యాయని, వాకింగ్‌ట్రాక్, గ్రాస్‌లాన్, పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, క్లాక్ టవర్ మరమ్మతు పనులు పూర్తి చేశారన్నారు. పెండింగ్ పనులు మరో 3 లేదా 4 రోజుల్లో పూర్తి చేసేలా కాంట్రాక్టర్ చొరవ చూపాలన్నారు. చుట్టగుంట చెరువు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు పరిశీలించి, పనుల జాప్యంపై డి.ఈ.ఈ.ని వివరాలు అడిగి తెలుసుకొని పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. చుట్టగుంట వాకింగ్ ట్రాక్, జంక్షన్‌లు నగరంలోకి వచ్చే ప్రధాన మార్గంలో ఉన్నందున గుంటూరు నగర ఖ్యాతిని ఇనుమడించేలా మోడల్‌గా ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



గాంధీ పార్కులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు : మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని 20వ డివిజన్‌లో కొబ్బరి తోట ప్రాంతంలో 16కె.వి.సబ్‌స్టేషన్ నిర్మించటానికి ఎలక్ట్రికల్ అధికారులు జిఎంసి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సర్వే అధికారులతో కలిసి పర్యటించి, తర్వాత సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని 20వ డివిజన్‌లోని పార్వతిపురం, బాబు రాజేంద్రప్రసాద్ కాలనీ, పీకలవాగుకట్ట, మేనకాగాంధీనగర్, అయ్యప్ప స్వామిగుడి ప్రాంతం, నల్లచెరువులోని కొన్ని ప్రాంతాలలో తరచుగా కరెంట్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజల నుండి చాలాకాలంగా ఫిర్యాదులు అందుతున్నాయని, కావున ఎలక్ట్రిసిటీ అధికారులు, నగర పాలక సంస్థ అధికారులతో కొబ్బరితోట ప్రాంతంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించామన్నారు. కొబ్బరి తోట ప్రాంతంలోనే కాక నగరంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలలో విద్యుత్ అధికారులతో మాట్లాడి సబ్‌స్టేషన్లు నిర్మించటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియచేశారు. సమావేశంలో ఎలక్ట్రికల్ ఈ.ఈ శ్రీనివాసబాబు, జిఎంసి డిఈఈ హనీఫ్, ఏఈలు చంద్రశేఖర్, రాంబాబు, సర్వేయర్ హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు

సంక్షోభాలకు పరిష్కారం మార్క్సిజమే...

కార్ల్‌మార్క్స్ 140వ వర్ధంతి సభలో వక్తలు
గుంటూరు, పల్నాడు జిల్లాలో ఘన నివాళి



గుంటూరు సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు :మానవ శ్రమ నుండే పెట్టుబడి ఉద్భవిస్తుందని మొట్టమొదటి సారిగా సూత్రీకరించిన మహామేధావి కారల్ మార్క్స్ అని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక బ్రాడిపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి సిపియం సీనియర్ నాయకులు ఎమ్.డి. అక్బర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కారల్ మార్క్స్ ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేదేమిలేదు-బానిస సంకెళ్ళు తప్ప అని పిలుపునిచ్చారన్నారు. ఆయన సిద్ధాంతం ద్వారా కార్మికులను, కర్షకులను ఏకం చేశారని, మార్క్సిజం పిడి సూత్రం కాదని, ఆచరణకు మార్గదర్శి అని, 1917 సోవియట్ విప్లవం ద్వారా, 1949 చైనా విప్లవం ద్వారా నిరూపితమైందన్నారు. అదనపు విలువను పెట్టుబడి దారులు దోచుకుంటున్నారని, కార్మికుల శ్రమ నుండి ఉద్భవించే అదనపు విలువ కార్మికులకు దక్కాలని, దీని కోసం పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమేనని చెప్పారు.కారల్ మార్క్స్ రాసిన పెట్టుబడి, కమ్యూనిస్టు ప్రణాళిక గ్రంధాలు సమాజగతిని మార్చివేశాయని, మార్క్సిస్టు సాహిత్యాన్ని విస్తతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళడమే వారికి నిజమైన నివాళిఅన్నారు.కార్యక్రమంలో ప్రత్యేహోదా సాధన సమితీ నాయకులు అవధానుల హరి, సిపియం నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, ఖాశింషహీద్, కష్ణకాంత్, సుధీర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు అని అన్నారు.



మంగళగిరిలో

సమ సమాజ స్థాపన కొరకు ఆయన కృషి చేశారని అన్నారు కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఈ కాటమరాజు ,ఎం బాలాజీ, మీద ప్రజా సంఘాల నాయకులు టి శ్రీనివాసరావు, షేక్ జానీ భాష, జె నవీన్ ప్రకాష్, కే నవీన్, ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ నాయకులు కె బుజ్జిబాబు, కే వెంకట్రావు, కే శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ కార్యాలయంలో కార్ల మార్క్స్ చిత్రపటానికి సిపిఐ నాయకులు చిన్ని తిరపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జానుబాబు, ఏ ప్రభాకర్, పి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట : సంక్షోభానికి పరిష్కారం మార్క్సిజం ద్వారానే సాధ్యమవుతుందని మానవ శ్రమ దోపిడీకి గురవుతుందని అనేక మంది కనిపెట్టారు కానీ శ్రమ దోపిడీ ఏ విధంగా జరుగుతుంది దీనికి పరిష్కార మార్గాలు కనిపెట్టిన వ్యక్తి కారల్ మార్క్స్ అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జర్మన్ శాస్త్రవేత్త, తత్వవేత్త, సామాజిక,సోషలిస్టు విప్లవకారుడు కారల్ మర్క్స్ 140వ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివ కుమారి అధ్యక్షత నిర్వహించారు. ముందుగా మార్క్స్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు దృష్ట్యా శ్రామిక కార్మిక పీడిత వర్గాల కోసం కారల్ మార్క్స్ పాటుపడ్డారని కొనియాడారు. సాధారణంగా కుటుంబంలో వ్యక్తి చనిపోతే కొన్ని నెలలకు లేదా కొన్నేళ్లకు మర్చిపోతారని శ్రామిక కార్మిక పీడిత వర్గాల కోసం పోరాడి మతి చెందిన మార్క్స్ చనిపోయి 140 ఏళ్లు గడుస్తున్నా ఆయన రచనలలో సిద్ధాంతాలలో సమాజంలో బ్రతికేఉన్నారన్నారు. సంపదకు మూలం శ్రమ అని యజమాని కార్మికునిగా మారితే శ్రమ దోపిడీని కొంత మేర అయినా అరికట్టేందుకు అవకాశం ఉంటుందిని గ్రహించిన తత్వవేత్త మార్క్స్ అన్నారు. కుటుంభం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ రచనలు ద్వారా ప్రజలలో ఉద్యమ స్ఫూర్తి నింపారని పెట్టుబడిదారులకు కంటిపై కునుకులేకుండా చేశారని గుర్తు చేశారు. రచనలు ఆపితే రూ కోట్ల రూపాయలు ఇస్తామని పెట్టుబడిదారీ వర్గాలు బ్రతిమాలినా భయపెట్టినా లొంగలేదన్నారు. మార్క్స్ కు ఆర్థికంగా సహకరించిన ఎంగెల్స్ ను ఇంటి నుండి గెంటివేసినా చిన్న ఉద్యోగం చేసి మార్క్స్ కుటుంబానికి అండగా ఉన్నారని మార్క్స్ రచనలతో పుట్టిన ఉద్యమాలతో అనేక దేశాలు ఆయన్ను బహిష్కరించాయన్నారు. మార్క్స్ జీవితం ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాల్ రావు , సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి. మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, నాయకులు ఈవూరి మస్తాన్ రెడ్డి, మస్తాన్వలి, ఎండి.హుస్సేన్,కె వెంకయ్య, ఫాతిమా, ఎల్ఐసి ఏజెన్సీ యూనియన్ నాయకులు ప్రసాద్,వి.రామసుబ్బారావు, జిలాని మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్